అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



ధారూరులో మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, ఏప్రిల్ 12 : అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను నెరవేరుస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ధారూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు భూమి పూజ చేశారు. గురుదోట్ల నుంచి టేకులగడ్డతండా వరకు రూ.3.20 కోట్ల వ్యయం, మైలారం గ్రామం నుంచి మైలారం కొత్తతండా వరకు 2.40 కోట్ల వ్యయంతో ఎస్టీఎస్డీఎఫ్ నిధుల ద్వారా రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ నిధులతో నాగారం నుంచి వికారాబాద్ వరకు 90 కోట్ల వ్యయంతో చేపట్టే నూతన బీటీ రోడ్డుకు స్పీకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ జాఫర్, హౌసింగ్ ఈఈ కృష్ణయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీవో నర్సింహులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి

పరిగి : పరిగిలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులు, ఎస్సీ సబ్ ప్లాన్, ఎస్టీ సబ్ ప్లాన్‌తోపాటు ఇతర నిధులు మంజూరై అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సన్నవడ్లకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.130 కోట్లతో కోటపల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కులకచర్ల : అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్పీకర్ అన్నారు. కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ముడిమ్యాల్ గ్రామంలో సాగవుతున్న పుదీనా పంట

ధర లేక దిగాలు..

- మార్కెట్‌లోనే పుదీనాను పారబోస్తున్న వైనం
- కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని రైతుల వేడుకోలు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 12 : పుదీనా పంటకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. కానీ ప్రస్తుతం రైతులకు మాత్రం కట్టకు రూపాయి కూడా రావడంలేదు. ధర తగ్గడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. నిల్వ చేసుకొని తర్వాత విక్రయిద్దామనుకున్నా ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదని వాపోతున్నారు. ఎప్పుడు ధర తగ్గితే.. అప్పుడు మార్కెట్ ఆవరణలోనే పారబోసే పరిస్థితి నెలకొంటున్నదని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కోల్డ్ స్టోరేజీలు అందుబాటులోకి తీసుకువచ్చి ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

అధికమవుతున్న పెట్టుబడి ఖర్చులు

పుదీనా పంటకు పెట్టుబడి గతంలో కంటే ప్రస్తుతం అధికం కావడంతో రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. మందుల ధరలు, కూలీ వ్యయం అధికమవుతుండడంతో కలిసి రావడంలేదని రైతులు అంటున్నారు. పంట కాలం 45 రోజుల నుంచి 60 రోజులు అయినప్పటికీ.. కలుపు, కోత కూలీల ఖర్చులు అధికమవుతున్నాయి. మార్కెట్‌లో ధర లేక చాలా వరకు నష్టం వాటిల్లుతున్నదని రైతులు వాపోతున్నారు.

పుదీనా గుడిమల్కాపూర్‌కు..

పుదీనా పంటను చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల్, మల్కాపూర్, రావులపల్లి, కుమ్మెర తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజూ కనీసం రెండు మినీ వ్యాన్లలో హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తీసుకెళ్తుంటారు. పంట మొత్తం అమ్మితే సరే.. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పారబోయాల్సిన పరిస్థితి ఉంట్నుది. కోల్ట్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే తరువాతి రోజు అమ్ముకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. అంతేకాదు ఈ పంటల ప్రాంతంలోనే పుదీనా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయించి.. వారికే అమ్మేలా ఒప్పందం చేయిస్తే మేలు జరుగుతుందన్నారు. దీంతో పాటు నగర శివారులో మరో మార్కెట్‌తో పాటు మరిన్ని రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలా చేస్తే రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకునే అవకాశం ఉంటుందంటున్నారు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

మా గ్రామం ముడిమ్యాల్‌లో పుదీనా పంటను అధికంగా సాగు చేస్తాం. నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో విక్రయిస్తాం. ధర లేని రోజు ఐతే అంతే సంగతి.. అక్కడే పారబోస్తాం. పుదీనా రైతులకు అనుగుణంగా కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది. ఇంకా కొన్ని మార్కెట్లు ఏర్పాటు చేస్తే నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశముంటుంది.

- ఊరడి రాములు, ముడిమ్యాల్, చేవెళ్ల మండలం

హామీలు అమలయ్యేనా..?

- పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పెండ్లిమడుగు
- పథకాలు అమలు చేయకపోవడంపై స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై మండిపడుతున్న గ్రామస్తులు

వికారాబాద్, ఏప్రిల్ 11 : వికారాబాద్ మండల పరిధిలోని చిన్న గ్రామమైన పెండ్లిమడుగు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. పెండ్లిమడుగు గ్రామంలో 203 ఇండ్లు ఉండగా, అందులో 660 మంది జనాభా ఉన్నారు. 535 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంవత్సరం గ్రామపంచాయతీకి పన్నుల ఆదాయం రూ.70వేలు వచ్చాయి. జనవరి 26న స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆ గ్రామానికి వచ్చి ప్రజలకు నాలుగు పథకాలు (రైతుల ఆత్మీయభరోసా, రుణ మాఫీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు) అమలు చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.. వీటితోపాటు గ్రామ సమస్యలైన రెండు ఫార్మేషన్ రోడ్లు రూ.10 లక్షలు, పెండ్లిమడుగు నుంచి చిట్టిగిద్ద వరకు బీటీ రోడ్డు, గ్రామపంచాయతీ భవనం మరమ్మతులకు రూ.5 లక్షలు, వాటర్ ట్యాంక్ మెట్ల కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరగా.. అన్ని సమస్యలు పరిష్కరించేందుకు తర వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా పథకాల అమలు, గ్రామాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

ఒక్కరికీ రుణమాఫీ కాని వైనం

పెండ్లిమడుగు గ్రామానికి చెందిన రైతుల ఖాతాలు కొత్తగడి సహకార సంఘం బ్యాంకులో ఉండటంతో లోన్లు తీసుకున్నారు. వారిలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. 48 రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోగా.. 24 రేషన్ కార్డులు రాలేదు. ఇందిరమ్మ ఇండ్లకు 14 మంది దరఖాస్తు చేసుకుంటే.. 6 ఇండ్లకు ముగ్గులు వేశారు. ఒక ఇంటికి పిల్లర్లు వేశారు. స్పీకర్ రావడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి దాదాపు రూ.40వేలు ఖర్చు చేశారు. టెంట్లు, కుర్చీలు, ఫ్లెక్సీలు, మైక్ సెట్, వాటర్ బాటిళ్లు తదితర వాటికి చేసిన అప్పులు ఇంకా తీరలేదు. స్పీకర్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సైతం తమ గ్రామానికి వచ్చి సమస్యలు అడిగిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమయానికి ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వస్తాయా..?

చాలా సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించాం. పునాదులు సక్రమంగా లేకపోవడంతో ఒక పక్క గోడ పగుళ్లు ఏర్పడుతున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని భయం భయంగా ఉన్నాం. ఇంట్లో నలుగురం ఉండటంతో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇందిరమ్మ ఇంటి కోసం బీటలు వారిన ఇల్లును తొలగిస్తే.. సకాలంలో ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వస్తాయో రావో అనే ఆందోళనలో ఉన్నాం.

- పాండురంగారెడ్డి, పెండ్లిమడుగు

రుణమాఫీ అయితదా... కాదా

నాకు 4 ఎకరాల భూమి ఉన్నది. పత్తి, కూరగాయ పంటలు సాగు చేసుకుంటాం. పంట పెట్టుబడులకు కొత్తగడి సహకార సంఘం బ్యాంకులో పాసుపుస్తకాలు పెట్టి రూ.1.35లక్షలు రుణం తీసుకున్నాం. అవి ఇప్పుడు రూ.2లక్షలు అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రుణమాఫీ అయితదనే ఆశతో ఉన్నాం. కాని కాలేదు. మా గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో ఇప్పుడైనా రుణమాఫీ చేస్తరేమోనని ఎదురుచూస్తున్నాం. అప్పులు తీర్చే భారం తగ్గుతుంది. రుణమాఫీ అయితదో కాదో అని దిగులుగా ఉన్నది.

- విఠల్‌రెడ్డి, రైతు, పెండ్లిమడుగు

చాలా మందికి రుణమాఫీ కాలేదు

కొత్తగడి సొసైటీలో లోన్లు తీసుకున్న రైతులకు రుణాలు రాలేదు. 8 ఎకరాల భూమిని ముగ్గురు కొడుకులకు సమానంగా పంచిపెట్టాం. వారు తీసుకున్న లోన్‌లకు రుణ మాఫీ కాలేదు. రుణ మాఫీ ఎప్పుడు అయితదోనని ఎదురుచూస్తున్నాం. కొత్తగడి సొసైటీ బ్యాంకులో నారాయణపూర్, పెండ్లిమడుగు, కొత్తగడి గ్రామాల రైతులకు రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారుల తప్పిదం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొన్నది. స్పీకర్ సార్ మా గ్రామ రైతులకు రుణమాఫీ చేస్తారనే ఆశతో ఉన్నాం. రెండు నెలలు గడిచినా ఇప్పటికీ ఆ ఊసెత్తడంలేదు.

- ప్రతాప్‌రెడ్డి, పెండ్లిమడుగు

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- రూ.44 లక్షల విలువచేసే 22 క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, ఏప్రిల్ 12 : నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం యాలాల మండల పరిధిలోని బాగాయిపల్లి చౌరస్తా సమీపంలో విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా ఎస్ఐ, సిబ్బందితో కలిసి అక్రమంగా 75 ప్లాస్టిక్ సంచుల్లో నిలువ ఉంచిన రూ.44 లక్షల విలువగల 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తాండూరులోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ, ఎస్ఐలతో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలోని బాగాయిపల్లి చౌరస్తా సమీపంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయించేవారిలో ముగ్గురు నిందితులున్నారన్నారు. వారిలో ఒకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కొత్తకోట మండలం, కొత్తకోట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి పోలీసులను చూసి పారిపోయాడు. అదే రాష్ట్రానికి చెందిన అన్నమయ్య జిల్లా కురచాల కోట మండలం, అంగళ్ల గ్రామానికి చెందిన నన్నపనేని శివ నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. 10 సంవత్సరాలుగా కర్ణాటక రాష్ట్రంలో నివసిస్తూ కొరిగెపల్లి నుంచి నకిలీ విత్తనాలను యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో విక్రయించడానికి తీసుకువచ్చినట్లు నిందితులు తెలిపారన్నారు. జూన్ నెల పంటల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో నిందితులు తక్కువ సమయంలో అధిక లాభాలను అర్జించాలనే ఉద్దేశంతో నకిలీ విత్తనాలను అమాయక రైతులకు అంటగట్టేందుకు ఈ పథకాన్ని వేశారన్నారు. రైతులు విత్తనాలను కొనే సమయంలో అధీకృత డీలర్ వద్ద రశీదుతో కూడిన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

చదువుల్లో రాణించలేకపోతున్నా..

పుట్టిన రోజునే ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థిని

మృతురాలు ప్రణీత(ఫైల్)

షాద్‌నగర్, ఏప్రిల్ 12 : తన పుట్టిన రోజునే ఓ ఇంటర్ విద్యార్థిని తనువు చాలించిన విషాద ఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లిలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. చటాన్‌పల్లికి చెందిన కటికెల శ్రీరాములు దంపతులకు ఓ కూతురు, ఇద్దరు కుమారులు. శ్రీరాములు స్థానికంగా ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషిస్తున్నడు. కూతురు ప్రణీత (18) షాబాద్ గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఇటీవలే పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. ఎప్పటిలాగే ఉదయం లేచిన ప్రణీత స్నానం గదిలోకి వెళ్లింది. కూతురు ఎంతకూ తిరిగి రాకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్నానం గదిని తెరిచి చూడగా ఉరేసుకొని కనిపించింది. విషయాన్ని పోలీసులకు తెలుపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొని మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. 'నన్ను క్షమించండి అమ్మానాన్న.. చదువుల్లో రాణించలేకపోతున్నా' అని రాసిపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సంస్కృతం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

సారస్వత పరిషత్తు డిమాండ్

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 12 జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని తెలంగాణ సారస్వత పరిషత్తు ఇంటర్మీడియట్ విద్యా శాఖను డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం మాతృభాష ను పూర్తిగా అణిచివేసే చర్యగా అభివర్ణించింది. ఇప్పటికే కొన్ని దశాబ్దాలుగా మార్కుల వేటలో విద్యార్థులకు సంస్కృతాన్ని అలవాటు చేసిన ప్రభుత్వ విధానం ఇప్పుడు మరింతగా తెలుగుకు అన్యాయం తలపెడుతున్నదని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య అన్నారు. కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా మాతృభాషలో విద్యాభ్యాసం తప్పనిసరిగా జరగాలని విద్యావేత్తలు, విద్యా కమిషన్లు ఎంతగా చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఇప్పటికే అన్ని దశల్లోనూ ఆంగ్ల భాషకు ప్రాధాన్యం కట్టబెట్టారని విచారం వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి వరకు ఎక్కడా బోధించని, జీవితంలో ఎక్కడా ఉపయోగపడని సంస్కృతాన్ని ప్రవేశపెట్టి తీరని అన్యాయం చేస్తే తెలంగాణ సాంస్కృతికంగా తన తరతరాల అస్తిత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అక్కా బావల వేధింపులతో

యువకుడి ఆత్మహత్య

- తల్లి ఏడు సంవత్సరాల క్రితం మృతి
- తండ్రి ఏడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

మృతుడు శ్రీధర్(ఫైల్)

ఆదిబట్ల, ఏప్రిల్, 12 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామానికి చెందిన చెనమోని శ్రీధర్(21) రావిరాల ఔటర్ రింగు రోడ్డు టోల్ గేటు 13 వద్ద పని చేసేవాడు. తన తల్లి ఏడు సంవత్సరాల క్రితం మృతిచెందింది. తండ్రి గత నెల 5న ఔటర్ రింగు రోడ్డుపై చెట్లకు నీళ్లు పోస్తుండగా కారు ఢీకొట్టడంతో దుర్మరణంపాలయ్యాడు.

పైసలు తెచ్చిన పంచాయితీ

పైసలు తెచ్చిన పంచాయితీతోనే శ్రీధర్ ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు అంటున్నారు. శ్రీధర్ తండ్రి చనిపోవడంతో దాదాపు 4లక్షల వరకు డబ్బులు వచ్చాయి. దీనికి తోడు శ్రీధర్ తన మేనమామ భూమిపై తన తండ్రి బతికి ఉండగానే వాటా కోసం కేసు వేశాడు. దీంతో కొన్ని రోజుల క్రితం గ్రామంలోని పెద్దలు మేనమామ భూమిపై వాటా కోసం వేసిన కేసుపై పంచాయితీ పెట్టి శ్రీధర్‌కు కొంత వాటా ఇవ్వాలని తీర్మానం చేశారు. అప్పటివరకు అంతా బాగానే ఉందనుకున్న శ్రీధర్‌కు తన అక్కా బావల నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో తనకు వచ్చే వాటాలో సగం భాగం తమకు ఇవ్వాలని కోరగా.. మనోవేదనకు గురైన శ్రీధర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు ఆ యువకుడు తన సెల్‌ఫోన్ స్టేటస్‌లో అక్కాబావతో పాటు అందరికి బై పెట్టాడు. అక్కాబావలు తోడుగా ఉంటారనుకుంటే పైసల కోసం ప్రాణాలు తీశారని గ్రామస్తులు అంటున్నారు. మృతుడి అక్క ఫిర్యాదుతో ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

50 ఎకరాలపై కన్ను..

- ఎమ్మెల్యే బంధువు అండతో కబ్జాకు ప్రయత్నం
- సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసిన హైకోర్టు

సిటీబ్యూరో, శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక.. అక్రమార్కులు అడ్డూఅదుపూ లేకుండా పోతున్నది. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు.. క్షణాల్లో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టిస్తూ కబ్జాకు పాల్పడుతున్నారు. శంషాబాద్‌లోని రూ.10 వేల కోట్ల విలువైన 50 ఎకరాలను కబ్జా చేసేందుకు పన్నాగం వేశారు. శంషాబాద్ పట్టణంలోని హెచ్ఎండీఏకి చెందిన 50 ఎకరాల భూమిని మలక్‌పేటకు చెందిన యహియా ఖురేషీ, వట్టెపల్లికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ గతంలోనే కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. వారు సృష్టించినవన్నీ తప్పుడు డాక్యుమెంట్లని ఆధారాలతో సహా చూపించి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఓ ఎమ్మెల్యే బంధువు సహాయంతో ఈ సారి మళ్లీ దొంగ పత్రాలు సృష్టించి కోర్టులో పిటిషన్ వేశారు. ఆ భూమి తమదేనంటూ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు మరోసారి కుట్రకు తెరలేపారు. అధికార పార్టీ ఎమ్మెల్యే బంధువు అండదండలతో ఖరీదైన 50 ఎకరాల ప్రభుత్వ భూ మిని కాజేసేందుకు పన్నాగం వేశారు. ఈసారి వారి మెడలు వంచిన హైకోర్టు.. సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలంటూ సర్కారును ఆదేశించింది.

సమగ్ర విచారణకు ఆదేశం

కబ్జాకోరులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిలువరించడంతో కాంగ్రెస్ నేతల అండదండలతో రూ. కోట్లు విలువ చేసే భూములను ఎలాగైనా తమ సొంతం చేసుకోవాలని భావించారు. దాదా పు 50 ఎకరాలకు పైగా ప్రహరీ నిర్మించి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఆ భూమి యహి యా ఖురేషీ, మహ్మద్ మొయినుద్దీన్‌కు చెందినదిగా బోర్డులు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈసా రి ఎమ్మెల్యే బంధువు సహకారంతో 2024 డిసెంబర్ 9న కోర్టు ఆ భూములు తమకే చెందినవిగా ఆర్డర్ ఇచ్చిన్నట్లు పేర్కొన్నారు. ఆ నకిలీ పత్రాలతో మరోసారి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యవహారంపై శుక్రవారం హైకోర్టులో విచారణకు రావడంతో న్యాయమూర్తి పిటిషినర్లు కోర్టుకు సమర్పించిన నివేదిక పూర్తిగా తప్పు ఉన్నట్లు గుర్తించారు. హెచ్ఎండీఏ భూములపై సమగ్ర విచారణ చేపట్టేందుకు సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా కోర్టును పదేపదే తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్న వారిపై చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

తప్పుడు ధ్రువపత్రాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ట్రక్ టెర్మినల్ నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం శంషాబాద్ పట్టణంలోని 724,725 సర్వే నంబర్లలో 214.02 ఎకరాల భూ మిని కేటాయించింది. అప్పట్లోనే అవార్డు(నం.1/ 1990. ఫైల్ నంబర్ ఐఏ84/86)ను కూడా జారీ చేసింది. కానీ సర్వే నం.725/21లో 7.7 ఎకరాలు, సర్వే నం.725/23లో 10.7 ఎకరాలు సర్వే నం.725/24లో 12. 34 ఎకరాలతోపాటు పాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారు 50 ఎకరాల భూమిని తమ పూర్వీకులు (పైగా అథారిటీ) నుంచి వేలంలో కొనుగోలు చేశారని పేర్కొం టూ.. ఫలక్‌నుమాకు చెందిన యహియా ఖురేషీ, వట్టెపల్లికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ హైకోర్టులో రెండు వ్యాజ్యాలను దాఖలు చేశారు. వాటిలోని అంశాలను నిజాం ఆస్తుల వివాదం మూలాలకు సంబంధించినవిగా కోర్టు భావించింది.ఆ పిటిషన్లకు సీఎస్-7బ్యాచ్ కేసులుగా పిలిచే పిటిషన్లతో జతచేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేసి సమాచారం పూర్తిగా తప్పుగా భావించింది. కోర్టుకు దాఖలు చేసిన వివరాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించింది. కోర్టు తీర్పు తమకు వ్యతిరేకంగా వచ్చినా... ఎలాగైనా ఆ భూములను దక్కించుకోవాలని ఈసారి కాంగ్రెస్ ఎమ్మెల్యే బంధువు సహకారంతో మళ్లీ పిటిషన్ వేసి భంగపడ్డారు.

డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో 57 మందికి జైలుశిక్ష

సిటీబ్యూరో, ఏప్రిల్12 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 5వ తేదీ నుంచి 11వరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సిటీలో నిర్వహించిన డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో 828 మందిపై కేసులు నమోదయ్యాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో 21 నుంచి 30 ఏండ్ల మధ్య 349 మంది ఉన్నారని తెలిపారు. వారంరోజుల పాటు నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 57 మందికి జైలుశిక్ష పడిందని వారు వెల్లడించారు.150 బీఏసీ ఎకౌంట్ కంటే ఎక్కువగా తాగిన వారు 138 మంది ఉన్నారని, ఇద్దరు మహిళలు సైతం ఈ డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఆఫీసుకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్ ఏప్రిల్ 12: ఆఫీసుకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఆభరణాలు మాయమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన జస్వంతి తన భర్త మహేశ్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లోని గాయత్రీ హిల్స్‌లో ఉంటున్నారు. ఈ నెల 10న ఇంటికి తాళం వేసి డ్యూ టీకి వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చి చూడగా గదిలో బ్యాగ్‌లో ఉన్న బంగారు గాజులు, రూ.15వేలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగ బాబా గుట్టు రట్టు

వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ పాల్గొన్న అడిషనల్ డీసీపీ, ఏసీపీ కాచిగూడ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

- మీ కుటుంబానికి దోషమని మహిళను నమ్మించి మోసం
- నగదు, బంగారు ఆభరణాలు కాజేసిన దుండగుడు
- కేసు నమోదు.. రిమాండ్

కాచిగూడ, ఏప్రిల్ 12: మీ కుటుంబానికి పట్టిన దోషం పోగొడుతానని ఓ మహిళను మోసం చేసిన దొంగ బాబాను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. శనివారం కాచిగూడ పీఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జగన్, కాచిగూడ సీఐ జ్యోత్స్న వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎల్ బీ నగర్ లోని రాక్ టౌన్ కాలనీకి చెందిన ఆంజనేయులు కుమారుడు హరిగెల సాంబశివుడు(45). వృత్తిరీత్యా ప్రైవేట్ ల్యాండ్ సర్వేయర్. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ప్లాన్‌తో దొంగ బాబాగా అవతారమెత్తాడు. తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన ఆనంద్ కుమార్ భార్య గీత వైద్య (47)దిల్ సూఖ్‌నగర్‌లో